7

సాక్షి అనకాపల్లి

సోమవారం । 7 । జూలై । 2025



న్యూస్‌రీల్

అప్పన్నకు 17.5 గ్రాముల బంగారు పుష్పం


బంగారు పుష్పం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి అనకాపల్లి మండలం సిరిసపల్లి గ్రామానికి చెందిన అలవరపు త్రిమూర్తులు 17.5 గ్రాముల **బంగారు** పుష్పాన్ని కానుకగా ఆదివారం అం**దించారు.** సింహగిరికి వచ్చిన దాత ఆ బంగారు పుష్పాన్ని దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకి ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు ఈవో రశీదు అందించారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రసాదం, ఆశీర్వచనం అందజేశారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

అనకాపల్లి: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను (పీజీఆర్ఎస్) సోమవారం ఉదయం యధావిధిగా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంతో పాటు జిల్లాలో అన్ని మండలాలు, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అనివార్య కారణాల వలన రాలేనివారు తమ అర్జీలను ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్ ఝ్ఘుజూౌట్చరుఽ p.gov.inలో నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు. అర్జీల పరిష్కార స్థితిని 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం


దాతకు రశీదు అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం కొనుగోలు నిమిత్తం విజయవాడకు చెందిన కెవీఎల్ హరినాథ్ రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందించారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ఆచార్యులుకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు రశీదు అందించారు. ఆలయ ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

14న బిమ్స్‌టెక్ పోర్టుల సదస్సు

సాక్షి, విశాఖపట్నం: సముద్ర వాణిజ్యంలో ఎదురవుతున్న సవాళ్లు, దక్షిణాసియా దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలపై చర్చించేందుకు విశాఖ వేదికగా ఈ నెల 14న అంతర్జాతీయ సదస్సు ప్రారంభం కానుంది. నోవాటెల్ హోటల్‌లో రెండు రోజులపాటు బిమ్స్‌టెక్ పోర్ట్స్ కాంక్లేవ్ పేరుతో జరిగే ఈ సదస్సుకు దక్షిణాసియాలోని ఏడు దేశాలు ప్రాతినిధ్యం వహించనున్నాయి. కేంద్ర పోర్టులు, జలరవాణా మంత్రిత్వ శాఖ, విశాఖపట్నం పోర్టు అథారిటీ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్ (బిమ్స్‌టెక్)లోని భారత్‌తోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన వాణిజ్య మంత్రిత్వ శాఖ, పోర్టుల ప్రతినిధులు హాజరవ్వనున్నారు.

వందే విష్ణుం.. భవభయహారం

ఉపమాకలో ఘనంగా తొలి ఏకాదశి పూజలు

మార్మోగిన విష్ణు సహస్రనామ పారాయణ

పోటెత్తిన భక్త జనం

నక్కపల్లి: తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడాద్రిపై కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారికి తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం కొండదిగువన స్వామివారి ఉత్సవమూర్తులకు తిరుమంజన కార్యక్రమం నిర్వహించి నూతన వస్త్రాలంకరణ చేశారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తులకు, ఆండాళ్లమ్మవారికి, క్షేత్రపాలకుడు వేణు**గోపాలస్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తదుపరి భక్తులకు దర్శనం** కల్పించారు. ఆషాఢమాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగాను, శయన ఏకాదశిగాను పిలుస్తారు. ఈ ఏకాదశికి ఎంతో విశిష్టత ఉండటంతో ఉపమాకలో వెలసిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఆలయ ప్రధాన గోపురం ఎదురుగా ఉన్న అఖిలాండం నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు.


స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


గరుడాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. అధికంగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఉపమాకకు చెందిన శ్రీనివాస భక్త సమాజం సభ్యులతో గరుడాద్రి చుట్టూ గిరిప్రదక్షిణ కార్యక్రమం జరిగింది. పూజా కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ నానాజీ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఏమిటీ చెత్త పనులు..



ఎంపీడీవోలకు పారిశుధ్య పర్యవేక్షణ బాధ్యతలు

- కోడి కూయకముందే గ్రామాల్లోకి...
- ఆవేదన చెందుతున్న అధికారులు
- పారిశుధ్యంపై ఐవీఆర్ఎస్ ద్వారా ఆరా
- కార్యదర్శులు, ఈవోఆర్డీలకు తప్పని పాట్లు

నక్కపల్లి: మండల కేంద్రంలో వివిధ శాఖలను సమన్వయపరుస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాల్సిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) నేడు తెల్లవారకముందే గ్రామాల్లో మురుగు కాలువల వద్దకు వెళ్లి చెత్తను తొలగించారో లేదో పరిశీలించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎంపీడీవోలతోపాటు ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు సైతం కోడి కూయక ముందే పల్లెలకు తరలి వెళ్లాల్సి వస్తోంది. పంచాయతీ స్వీపర్లు (గ్రీన్ అంబాసిడర్లు) ప్రతిరోజు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడం, మురుగు కాలువల్లో పూడికతీత చేపట్టడం, బ్లీచింగ్, ఫినాయిల్ చల్లించడం వంటి విధులు నిర్వర్తించాలి. ఈ పనులను సర్పంచ్‌లు, కార్యదర్శులు పర్యవేక్షించాలి. గత ప్రభుత్వాల్లో అదే జరిగేది. కూటమి ప్రభుత్వం స్వీపర్ల జీతాల చెల్లింపులో జాప్యం చేస్తోంది. దీంతో


ఉదయాన్నే నక్కపల్లిలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతారామరాజు (ఫైల్)

వారు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ పట్ల కొంచెం అలసత్వం ప్రదర్శించారు. జీతాలు సకాలంలో చెల్లించి, సక్రమంగా పనిచేయించుకోవలసిన సర్కారు.. అదేమీ చేయకుండా బరువు బాధ్యతలను ఎంపీడీవోలు, సిబ్బంది నెత్తిన పెట్టింది. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర (సాస్) కార్యక్రమంలో భాగంగా స్వీపర్లు చేయాల్సిన పనుల పర్యవేక్షణ బాధ్యతలను కార్యదర్శులకు, ఎంపీడీవోలకు అప్పగించి, ఉదయాన్నే గ్రామాల్లోకి వెళ్లి చెత్తను తరలించే ప్రక్రియను స్వయంగా పరిశీలించాలని ఆదేశించింది. గెజిటెడ్ హోదా కలిగిన అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు ఐవీఆర్ఎస్ ద్వారా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలను ప్రభుత్వం తెలుసుకోవడం, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఎంపీడీవోలనే బాధ్యులను చేయడం కూడా వారిని మనస్తాపానికి గురి చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉదయం 5 గంటలకు కార్యదర్శి గ్రామాలకు రావాలి. 6 గంటలకు ఈవోపీఆర్డీ, ఉదయం 7 గంటలకు ఎంపీడీవో రావాలి. ప్రతి రోజు ఈ అధికారులు ఏదో ఒక గ్రామానికి వెళ్లి చెత్తను తరలించే ప్రక్రియ స్వయంగా పర్యవేక్షించాలి.

అసలే సిబ్బంది కొరత.. ఆపై పని భారం

జిల్లాలో నక్కపల్లి, ఎస్.రాయవరం, నాతవరం, బుచ్చెయ్యపేట తదితర ఏడు మండలాల్లో పూర్తి స్థాయి ఎంపీడీవోలు లేరు. ఇన్‌చార్జ్‌లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఈ నెలలో ముగ్గురు ఎంపీడీవోలు ఉద్యోగ విరమణ చేస్తున్నారు. అదేవిధంగా ఏడు మండలాల్లో ఈవోపీఆర్డీలు లేరు. జిల్లాలో 132 మంది కార్యదర్శుల కొరత కూడా ఉంది. పోస్టులు భర్తీ చేయకుండా, గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు సకాలంలో చెల్లించకుండా మండల స్థాయి అధికారులకు పొద్దున్నే పారిశుధ్య నిర్వహణ బాధ్యతలు అప్పగించడం పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎంపీడీవోలేకాదు డీఎల్‌పీవో, డీపీవోలు సైతం ప్రతిరోజు ఏదో ఒక గ్రామాన్ని ఉదయాన్నే సందర్శించాల్సి వస్తోంది. వీటికి తోడు జిల్లా అధికారులు నిర్వహించే వెబినార్లు, పి4 సర్వేలు, మండల పరిషత్ ఆధ్వర్యంలో జరిగే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షలు, పర్యవేక్షణలు వంటి పనుల ఒత్తిడితో ఎంపీడీవోలు సతమతమవుతున్నారు.

రూ.45.63 లక్షల వేతన బకాయిలు

స్వీపర్లకు పూర్తి స్థాయిలో జీతాలు చెల్లిస్తే వారే ఈ విధులను సక్రమంగా నిర్వర్తిస్తా**రని, వేతనా**లు ఇవ్వకపోవడం వల్లే పారి**శుధ్యం అధ్వా**నంగా తయారవుతోందని **విమర్శలు** వ్యక్తమవుతున్నాయి. అనకా**పల్లి జిల్లా**లో సుమారు 646 పంచాయ**తీల్లో 1868** మంది గ్రీన్ అంబాసిడర్లు **పనిచేస్తున్నా**రు. వీరికి ఒక్కొక్కరికి రూ.6 **వేల చొప్పు**న వేతనాలు చెల్లిస్తున్నారు. **ఒకేసారి కా**కుండా దఫదఫాలుగా రెండు, **మూడు నెల**లకొకసారి వేతనాలు చెల్లిస్తు**న్నారు.** వీరికి ఈ ఏడాది జూన్ నాటికి రూ.45.63 లక్షల వేతనాలు చెల్లించాల్సి ఉంది. వేతన బకాయిలు ఉండటంతో గ్రీన్ అంబాసిడర్లు **కూడా** పారిశుధ్య పనులు చేయడానికి **ఇష్టపడటం** లేదు. వారికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

గోవాడ సుగర్స్‌ను భ్రష్టు పట్టించారు..


- నట్టేట మునిగిన రైతులు, కార్మికులు
- పట్టించుకునే నాథులే కరువు
- ధ్వజమెత్తిన సీడీసీ చైర్మన్ సుంకర



మాడుగుల రూరల్: రాష్ట్రంలో సహకార రంగంలో లాభాల బాటలో నడుస్తున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కూటమి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని, రైతులను, కార్మికులను నట్టేట ముంచిందని వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం ఆయన ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో సాక్షితో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో బూడి ముత్యాలనాయుడు, కరణం ధర్మశ్రీల కృషితో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి రూ.89 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. గతంలో క్రషింగ్ పూర్తయిన తర్వాత సుగర్ ఫ్యాక్టరీ ద్వారా జూన్, జూలై సీజన్‌లో చెరకు కాటాల వద్ద యూరియా, పొటాష్, డీఏపీ, సూపర్, గ్రోమోర్, తదితర ఎరువులను సబ్సిడీపై విక్రయించేవారని, నేడు రైతులను పట్టించుకొనే వారే లేరన్నారు. ఇటీవల చీడికాడ మండలం వింటిపాలెం గ్రామంలో సభ్య రైతు సిరసపల్లి అప్పారావు మృతి చెందితే కనీసం సుగర్ ఫ్యాక్టరీలో నమోదు చేసే నాథుడు కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని సుగర్ ఫ్యాక్టరీ మహాజన సభలో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ప్రకటించారని, ఇది జరిగి ఆరుమాసాలు కావస్తున్నా నేటికీ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చెయ్యలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 మాసాలు కావస్తున్నా ఇటు రైతులు, అటు కార్మికుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన అన్నారు. చెరకు కాటాలు బోసి పోయాయని, ఈ ఏడాది కూడా చెరకు పంటకు బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవలసిన దుస్థితి నెలకొందని, చెరకుకు గిట్టుబాటు ధర లేకపోవడంతోపాటు సకాలంలో పేమెంట్లు ఇవ్వకపోవడమే దీనికి కారణమని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

అప్పుల కుప్ప.. యోగాంధ్ర గొప్ప

- యోగాసనాలకు రూ.75 కోట్లు ఖర్చు
- ప్రభుత్వం విదిల్చింది కేవలం రూ.28 కోట్లు
- పనులు చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో బిల్లులు
- కలెక్టరేట్ చుట్టూ కాంట్రాక్టర్లు ప్రదక్షిణలు



మహారాణిపేట (విశాఖ): యోగాంధ్ర రికార్డుల మాటిలా ఉన్నా.. అప్పుల భారం మాత్రం తలనొప్పిగా మారింది. టెంట్ల నుంచి స్నాక్స్ వరకు బిల్లుల చెల్లింపులతో అధికారుల తలబొప్పి కడుతోంది. యోగాంధ్ర పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ బిల్లులు చెల్లించాలని అధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నారు. యోగాంధ్ర కార్యక్రమం పూర్తి అయి 15 రోజులు అవుతున్న ఇంకా ఎలాంటి బిల్లులు చెల్లించలేదని వ్యాపారులు, కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. గత నెల 21న విశాఖలో యోగా విన్యాసాల కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర ప్రముఖులతో కార్యక్రమం పూర్తయింది. దాదాపు 3 లక్షల మందితో యోగాసనాలు వేసి గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సుమారు రూ.75 కోట్లు ఖర్చు జరిగిందని అధికారులు చెబుతున్నారు. యోగాంధ్ర నిర్వహణకు కూటమి సర్కార్ రెండు విడతల్లో రూ.28 కోట్లు విడుదల చేసింది. మిగిలిన నిధులు విడుదల చేయాలని జిల్లా యంత్రాంగం లేఖ కూడా రాసింది.

కంపార్ట్‌మెంట్ల నిర్మాణానికి భారీగా ఖర్చు

విశాఖ ఆర్‌కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు మొత్తం 368 కంపార్ట్‌మెంట్లు నిర్మించారు. ఒక్కొక్క కంపార్ట్‌మెంట్‌లో 1000 మంది ఉండేలా రూపొందించారు. దీనికే బిల్లు తడిసి మోపెడయింది. అరకొర నిధులతో చేపట్టిన పలు పనులు అంచనాలు మించిపోయాయి. వీటితో పాటు స్టేజీల నిర్మాణం కూడా జరిగింది. యోగా వేడుకల్లో పాల్గొనే వారికి కేంద్ర ప్రభుత్వం మ్యాట్లు, టీ షర్ట్‌లు ఇచ్చింది. అలాగే స్నాక్స్ కూడా పంపిణీ చేశారు. దాదాపు 8 నుంచి 9 లక్షల వరకు స్నాక్స్, ఇతర ఆహార పదార్థాల కోసం వెచ్చించారు. అలాగే వీఐపీలు, వీవీఐపీలకు హోటళ్లలో బస, వారు తిరగడానికి కార్ల ఏర్పాటు వంటి వాటికి భారీగా ఖర్చయింది. అయితే అయిన ఖర్చులో సగానికి పైగా చెల్లింపులు జరగలేదు. ఫలితంగా ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. బిల్లుల కోసం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నిషేధిత మందులు.. యథేచ్ఛగా అమ్మకాలు

- వయాగ్రా, అబార్షన్, మత్తు మందుల కిట్ల విక్రయం
- జోరుగా కాలం చెల్లిన మందుల విక్రయాలు
- కొన్ని మందుల షాపులు, ఏజెన్సీల్లో అక్రమాలు
- దాడులు చేస్తున్నా పట్టించుకోని మెడికల్ మాఫియా


విశాఖలో మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట (విశాఖ): స్మార్ట్ సిటీ విశాఖలో నిషేధిత మందుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు, ఇంజక్షన్లు, గర్భస్రావ కిట్లు, లైంగిక సామర్థ్యం పెంచే వయాగ్రా వంటి ఔషధాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. కొన్ని మెడికల్ షాపులు, ఏజెన్సీలు అక్రమాలకు అడ్డాగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, మామూళ్ల ఆరోపణల నడుమ 'మెడికల్ మాఫియా'తన కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తోంది. వాస్తవానికి వీటికి విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ.. ఎమ్మార్పీకి మించి అమ్మకాలు సాగిస్తుండడం గమనార్హం.

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా సుమారు 4,500 మందుల దుకాణాలు, హోల్‌సేల్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో అనేక షాపులు ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేశాయి. కనీస అర్హత కలిగిన ఫార్మసిస్టులు లేకుండా, అమ్మకపు వివరాలు నమోదు చేసే కంప్యూటర్లు, రిజిస్టర్లు లేకుండానే వ్యాపారం సాగిస్తున్నాయి. కాలం చెల్లిన మందులను సైతం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా దగ్గు మందులు, నొప్పి నివారణ మందులు, మత్తును కలిగించే ఇంజక్షన్లను యువతకు సులభంగా విక్రయిస్తున్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో వయాగ్రా అమ్మకాలు అనధికారికంగా జరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా నగరంలోని జిల్లా పరిషత్, రెల్లివీధి, కురుపాం మార్కెట్, కొత్త రోడ్డు, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు వంటి ప్రాంతాలు ఈ అక్రమ దందాకు కేంద్రాలుగా మారాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వయాగ్రా, అబార్షన్ కిట్లను ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరకు అమ్ముతూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

మొక్కుబడిగా తనిఖీలు

ఔషధ నియంత్రణ మండలి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు, ఈగల్ వంటి వివిధ శాఖలు అడపాదడపా దాడులు చేస్తున్నా ఫలితం శూన్యంగానే ఉంటోంది. దాడుల తర్వాత కొద్ది రోజులకే మాఫియా మళ్లీ తమ అక్రమ వ్యాపారాన్ని యథావిధిగా ప్రారంభిస్తోంది. కొన్ని శాఖలకు మామూళ్లు అందుతుండటమే దీనికి కారణమన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఔషధ నియంత్రణ శాఖలో సిబ్బందికి వాహనాలు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో తనిఖీలు మొక్కుబడిగా మారుతున్నాయన్న విమర్శలున్నాయి. తనిఖీల్లో బిల్లులు లేకుండా అమ్మకాలు జరపడం, ప్రిస్క్రిప్షన్ వివరాలు నమోదు చేయకపోవడం, ఫార్మసిస్టులు అందుబాటులో లేకపోవడం వంటి అనేక ఉల్లంఘనలు బయటపడినా, చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉంటున్నాయి. ఈ ఆరోపణలపై ఔషధ నియంత్రణ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ వద్ద ప్రస్తావించగా.. 'వయాగ్రా, అబార్షన్ కిట్ల అమ్మకాలు మా దృష్టికి రాలేదు. మేము రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తున్నాం. ఒకవేళ ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే, వారి షాపు లైసెన్సులను తక్షణమే రద్దు చేస్తాం'అని 'సాక్షి'కి తెలిపారు.

అమ్మ నేర్పిన పాటలు.. ఆధ్యాత్మిక తేనె ఊటలు

- భక్తి గీతాలతో పుస్తక ప్రచురణ
- వేద పాఠశాలలో ఘనంగా ఆవిష్కరణ


'అమ్మ నేర్పిన భక్తి పాటలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేద పాఠశాల గురువులు, పక్కన పుస్తక సంకలనకర్త సాయికృష్ణ దంపతులు


పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఆధ్యాత్మిక ప్రోత్సాహకులు

యలమంచిలి రూరల్: అమ్మ జోలపాటలో ఆధ్యాత్మికతను మేళవిస్తుంది.. పనిపాటల్లో అలుపు సొలుపు తెలియకుండా భక్తి గీతాలను ఆలపిస్తుంది.. ఆ గానామృతాన్ని గుండెల్లో దాచుకున్న ఓ ధన్య జీవి వాటిని మరచిపోకుండా, జ్ఞాపకాల దొంతరలో నుంచి బయటకు తీసి పుస్తకంగా ముద్రించారు. దానికి 'అమ్మ నేర్పిన భక్తి పాటలు' అని పేరు పెట్టారు. పోణంగి సాయికృష్ణ సంకలనం చేసి ముద్రించిన ఆ పుస్తకాన్ని ఆదివారం రాత్రి స్థానిక వేద పాఠశాల గురువులు శ్రీనివాస కులకర్ణి, ఆకొండి వెంకటసాయి శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం సొంతమవుతుందని చెప్పారు. విష్ణు సహస్రనామాలు, గజేంద్ర మోక్షానికి సంబంధించి ఎక్కడా అందుబాటులో లేని 150 సంవత్సరాల క్రితం పూర్వీకుల వాడుకలో ఉన్న అరుదైన పాటలను ముద్రించడం ఎంతో గొప్ప విషయమన్నారు. సాయికృష్ణకు అతని తల్లి ఆర్య భవాని నేర్పిన ఆధ్యాత్మిక పాటలను సమాజ హితం కోసం పుస్తక రూపంలో తీసుకురావడం గొప్ప విషయమన్నారు. దీనిద్వారా సమకాలీన ప్రపంచంలో మరికొంత మంది అరుదైన ఆధ్యాత్మిక పాటలు నేర్చుకునేందుకు అవకాశం కలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆధ్యాత్మిక సౌరభం చెక్కు చెదరకుండా అందరిలో దైవికమైన ఆలోచనలు పెంపొందేందుకు కృషి చేస్తే సమాజంలో మార్పు వస్తుందన్నారు. సాయికృష్ణ మాట్లాడుతూ ఆనాటి పాటలు కనుమరుగవకుండా ఉండాలనే సదుద్దేశంతో మొత్తం 1008 పుస్తకాలను ముద్రించామని, ఆసక్తి గలవారికి ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. వేద పాఠశాల గురువులు, ముందుమాట రాసిన కవయిత్రి పెద్దింటి శ్రావ్యలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సకల దేవతా ప్రార్థన, విష్ణు సహస్రనామాలు, గజేంద్రమోక్షం పారాయణ చేపట్టారు.

కూటమి కుట్రతో అభివృద్ధికి విఘాతం

- అభివృద్ధి పనుల బిల్లుల చెలింపులో జాప్యం
- 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు
- వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో బిల్లుల జాప్యం
- కేంద్రం ఆర్థిక సంఘం నిధులు తల్లికి వందనానికి మళ్లించారని ప్రచారం



నాతవరంలో ఆర్థిక సంఘం నిధులతో వేసిన రోడ్డు



పి.జగ్గంపేటలో నత్తనడకన డ్రైనేజీ పనులు



గునుపూడిలో నిర్మించిన కల్వర్టుకు 8 నెలలుగా అందని బిల్లు

నాతవరం: వైఎస్సార్‌సీపీ పాలక వర్గాలకు మంచి పేరు వస్తుందన్న అక్కసుతో కూటమి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన అభివృద్ధి పనులు బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తుంది. జిల్లా పరిషత్‌తో పాటు జిల్లాలో గల మండల ప్రజా పరిషత్ పాలకవర్గాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన వారే పదవుల్లో ఉన్నారు. వాటితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాయతీ సర్పంచులు పాలక వర్గ సభ్యులు అధిక శాతం వైఎస్సార్‌సీపీ మద్దతు దారులే ఉన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ఆయా పాలక వర్గాల సభ్యుల ఆధ్వర్యం లోనే అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించే విషయంలో ఉమ్మడి జిల్లాలో గానీ మండలాల్లో గానీ ఎలాంటి పెత్తనం సాగదు. వైఎస్సార్‌సీపీ అధికారంలో లేనప్పటికీ 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రజలకు కావలసిన అనేక అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో జరుగుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుంది.

దీనిని తట్టుకోలేక జెడ్పీ మండల పరిషత్‌లకు కేటాయించిన ఆర్థిక సంఘం నిధులతో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు సకాలంలో చెల్లించడంలేదు. ఈ ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్ మండల పరిషత్‌లకు సంబంధించి ఆర్థిక సంఘం నిధులతో డ్రైనేజీలు, కల్వర్టులు, సిమెంటు రోడ్లు వంటి అభివృద్ధి పనులు సుమారుగా రూ.25 కోట్లు వెచ్చించి చేశారు. కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదట్లో కొంతమేర బిల్లులు చెల్లింపులు చేసి తర్వాత పూర్తిగా నిలిపివేశారు. జెడ్పీ నుంచి ప్రతి జెడ్పీటీసీకి రూ.20 లక్షల వరకు నిధులు కేటాయించారు.

కొన్ని మండలాల్లో జెడ్పీ చైర్మన్ అభీష్టం మేరకు అదనంగా నిధులు ఇవ్వడంతో వారంతా ఆయా మండలాల్లో యుద్ధ ప్రతిపాదికన అభివృద్ధి పనులు చేశారు. ప్రతి మండలంలో మండల పరిషత్‌కు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 50 లక్షలతో ఎంపీటీసీ సెగ్మెంట్లో అభివృద్ధి పనులు చేశారు. పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లింపుల్లో కూటమి ప్రభుత్వం కావాలని కాలయాపన చేస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి మళ్లించినట్టుగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను అభివృద్ధి పనులు బిల్లుల విషయంలో ఈవిధంగా ఇబ్బంది పెట్టడం భావ్యం కాదంటున్నారు.

బిల్లులు రాలేదు



మా పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు ఎనిమిది నెలలుగా రాలేదు. ఉపాధి హామీ పథకం నిధులు అయితే బిల్లులు ఆలస్యంగా వస్తాయని, ఆర్థిక సంఘం నిధులు బిల్లులు వెంటనే వస్తాయని డ్రైనేజీలు కల్వర్టులు నిర్మాణం చేశాను. నేటికీ బిల్లులు చెల్లించలేదు – **వేముల సూర్యనారాయణ,** సర్పంచ్ గునుపూడి

ఇబ్బందిగా ఉంది..



మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులు చేశాం. బిల్లులు రాక చాలా ఇబ్బంది పడుతున్నాం. ఉన్నతాధికారులు అడిగితే వస్తాయంటున్నారు.. తప్ప నెలలు గడుస్తున్నా బిల్లులు వచ్చిన సందర్భాలు లేవు. – **కాపారపు అప్పలనర్స,** జెడ్పీటీసీ సభ్యురాలు

ఎంపీటీసీ సభ్యులు ముందుకు రావడం లేదు



బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని తెలిసి ఎంపీటీసీ సభ్యులు వారి సిగ్మెంట్లో పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. మా మండలంలో రూ. 48 లక్షలు ఆర్థిక సంఘం నిధులు పలు అభివృద్ధి పనులు చేసేందుకు ఎంపీటీసీ సభ్యులకు కేటాయించాం. కొంత మంది పనులు చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇంకా రూ.18 లక్షలతో అభివృద్ధి పనులు చేయాలి. కూటమి ప్రభుత్వం జిమ్మిక్కులకు నేతలు హడలెత్తిపోతున్నారు. – **సాగిన లక్ష్మణమూర్తి,** ఎంపీపీ నాతవరం

తల్లికి వందనానికి మళ్లించేశారు



కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి ఖర్చు చేసేసారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన పలు అభివృద్ధి పనులకు రూ.10 కోట్లకు పైగా బిల్లులు ఇవ్వాలి. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో జరుగుతున్న పనులతో మాకు మంచి పేరు వస్తుందన్న అక్కసుతో బిల్లులు రాకుండా కాలయాపన చేస్తున్నారు. **–జి.సుభద్ర,** జెడ్పీ చైర్‌పర్సన్

జునోటిక్ వ్యాధుల పట్ల అవగాహన అవసరం

- 11వ తేదీ వరకూ యాంటీ రేబిస్ టీకాలు
- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహనరావు



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహనరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, ఏడీ సౌజన్య

అనకాపల్లి: లూయిస్ పాశ్చర్ శాస్త్రవేత్త మొదటిసారిగా 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలునికి వ్యాధి రాకుండా టీకా మందు విజయవంతంగా ఇచ్చినందుకు ఆ రోజున ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు అన్నారు. స్థానిక గాంధీనగరం జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా 80 పశుసంవర్ధక శాఖ ఆస్పత్రుల్లో ఈనెల 11వ తేదీ వరకూ ఉచితంగా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేయడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రం ఆస్పత్రిలో సోమ, మంగళవారాలు కూడా వ్యాక్సిన్లు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 24 వేల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. బ్యాక్టీరియా, వైరస్ , ఏలిక పాములు వంటి సూక్ష్మజీవుల ద్వారా మానవుల్లో ఎక్కువగా జునోటిక్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. రేబిస్, బర్డ్‌ఫ్లూ ,స్వైన్ ఫ్లూ, ఆంత్రాక్స్, హెపటైటిస్, బ్రూసెల్లోసిస్, క్యూ ఫీవర్, ఎబోలా, జియార్డియాసిస్ వంటి రోగాలు సాధారణంగా సమాజంలో జంతువుల నుంచి మానవులకు వ్యాప్తి చెందుతుందన్నారు. రేబిస్ ఉన్న కుక్కకాటు వల్ల ఈ వ్యాధి మనుషులు ఇతర జంతువులకు సోకుతుందని, కుక్క కరిచిన ఏడవ రోజు నుంచి నాలుగేళ్లలోపు ఎప్పుడైనా ఈ వ్యాధి లక్షణాలు బయటపడే అవకాశం ఉందన్నారు. జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, మింగలేకపోవడం, నీటిని చూస్తూ భయపడడం, పిచ్చిగా ప్రవర్తించడం వీటి ప్రధాన లక్షణాలని ఆయన తెలిపారు. కుక్క కరిచిన వ్యక్తి అయిదు డోసుల యాంటీ రేబిస్ టీకా తప్పనిసరిగా తీసుకోవాలని 0, 3, 7, 14, 28 రోజుల్లో టీకా తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఆర్డీవో షేక్ ఆయిషా మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ సౌజన్య మాట్లాడుతూ జునోటిక్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణహాని కలిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు, పశుసహాయకులు, పెంపుడు కుక్కల సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ కమిటీని నేటి వరకూ నియమించలేదని, కమిటీని నియమించి, మధ్యంతర భృతి(ఐఆర్) ఈనెల నుంచి ప్రభుత్వం అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్న బ్బాయి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్న సందర్భంగా 'సుపరిపాలన' అనే ఉత్సవాలు జరుపుకుంటున్న వేళ ఉద్యోగులకు న్యాయంగా రావలసిన పీఆర్సీని తక్షణమే అమలు చేసి సుపరిపాలన విషయం మాట్లాడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్‌లు, పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించవలసిన రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలనికోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం గ్రాట్యూటీ నేటికీ చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షుడు పి.వెంకట్రావు, సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, కోశాధికారి జోగా రాజేష్, జిల్లా కార్యదర్శులు జి.ఎస్ ప్రకాష్, రమేష్‌రావు, సీనియర్ నాయకులు, జీకేఆర్ స్వామి, ఎస్.ఎస్.నాగమణి, శంకర్ ప్రసాద్, ఉప్పాడ రాము పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథుని తిరుగు రథయాత్ర



ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి



ఉత్సాహంగా రథాన్ని లాగుతున్న యువత, భక్తులు

అనకాపల్లి టౌన్: గూడ్స్‌రోడ్ ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువైన సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథుడు ఆదివారం భక్తులకు కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని ఉంచారు. రథయాత్రను టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ప్రారంభించారు. రథయాత్ర మళ్లవీధి, గాంధీబొమ్మ జంక్షన్, పెరుగుబజార్ మెయిన్‌రోడ్, వేల్పులవీధి, శారదాబ్రిడ్జి, చేపలబజార్, చింతావారి వీధి, గవరపాలెం పురవీధులలో ఊరేగించి అగ్గిమర్రి చెట్టు వద్ద ఉన్న జగన్నాథ స్వామి ఆలయానికి చెరుకుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య



మృతుడు సతీష్(ఫైల్)

నక్కపల్లి: మద్యం సేవించవద్దన్నదని తల్లి మందలించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నక్కపల్లి మండలంలో జరిగిన సంఘటన మేరకు వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకి చెందిన చింతాకుల సతీష్ (22)తల్లి మంగ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఏడాది క్రితం ఉపమాక వచ్చి నివాసం ఉంటున్నారు. సతీష్ హెటిరో కంపెనీలో కాంట్రాక్టర్ దగ్గర వెల్డర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి మద్యం అలవాటు ఉంది. ఈ నెల 3న ఇంటి వద్ద మద్యం తాగి ఉండడంతో తల్లి మందలించింది. రాత్రి మేడ మీదకు వెళ్లాడు. కొద్దిసేపటికి వాంతులు చేసుకుంటూ కేకలు వేయడంతో వెళ్లి చూస్తే గడ్డి మందు తాగి ఉన్నాడు. కుటుంబ సభ్యులు సతీష్‌ను నక్కపలి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ నుంచి తుని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ వెంకటరావు తెలిపారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో జాతా

రావికమతం: ఈ నెల 9న దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి సత్యవతి పిలుపునిచ్చారు.ఆటో జాబితాను ఆదివారం మేడివాడ, టి.అర్జాపురం ,కొత్తకోట గ్రామాల్లో సీఐటీయు జిల్లా కార్యదర్శి సత్యవతి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక కుటుంబ జీవనానికి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు.లేబర్ కోడ్ మార్పును మానుకోవాలని తదితర డిమాండ్లతో ఈ సమ్మెను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

చాలా కాలంగా కల్తీ మద్యం వ్యాపారం

నిందితులకు రిమాండ్ • జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్

అనకాపల్లి: చేతులు శుభ్రపరుచుకునే స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు చేస్తూ ఈ నెల 2వ తేదీన పట్టుబడిన రుత్తల రాము, యలమంచిలి వెంకటేశ్వరరావులను రిమాండ్‌కు తరలించామని జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వీరిద్దరూ ఈ కల్తీ మద్యం వ్యాపారాన్ని గత రెండేన్నరేళ్లుగా నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితుల వెనుక టీడీపీ నేత ఉన్నారని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదన్నారు.

హద్దు.. దాటనివ్వదు.!

- మత్స్యకారుల పాలిట దిక్సూచి ట్రాన్స్‌పాండర్
- సరిహద్దు హెచ్చరికలను అందించే వ్యవస్థ
- జిల్లాలో 1,100 బోట్లకు అమర్చేందుకు మత్స్యశాఖ సన్నద్ధం
- ఇప్పటివరకు 634 బోట్లకు శతశాతం రాయితీతో అందజేత





మత్స్యకార బోటుకు ట్రాన్స్‌పాండర్ ఏర్పాటు

మహారాణిపేట: సముద్రంలో వేట సాగిస్తున్న మత్స్యకారులు తరచుగా తుపానులు, ఇతర ప్రకృతి వైపరీత్యాల బారిన పడి ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. అలాగే సరిహద్దులు దాటి ఇతర దేశాల భద్రతా సిబ్బందికి చిక్కి జైళ్లలో మగ్గుతున్నారు. సముద్రంలో సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ లేకపోవడం వల్ల తుపానుల ముప్పును గుర్తించలేకపోవడం, చిన్నపాటి తప్పిదాలతో సరిహద్దులు దాటడం వంటి సమస్యలను మత్స్యకారులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కేంద్ర మత్స్యశాఖ మత్స్యకారుల కోసం సరికొత్త పరికరాన్ని అందుబాటులోకి తెచ్చింది. 100 శాతం సబ్సిడీతో 'ట్రాన్స్‌పాండర్' అనే దిక్సూచిని గంగపుత్రులకు అందిస్తూ, వారిని సురక్షితంగా ఉంచడానికి అభయమిస్తోంది.

బోట్లకు అమరిక

ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ అత్యాధునిక స్పేస్ టెక్నాలజీ ఆధారిత ట్రాన్స్‌పాండర్లను రూపొందించింది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్వై) పథకం కింద ఇది పూర్తి ఉచితంగా (100 శాతం రాయితీతో) అందిస్తున్నారు. జిల్లాలో మొత్తం 350 మోటరైజ్డ్, 760 మెకనైజ్డ్ బోట్లకు అంటే.. మొత్తంగా 1100 బోట్లకు ఈ ట్రాన్స్‌పాండర్లను అమర్చాలని మత్స్యశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ మేరకు మత్స్యకారులకు ట్రాన్స్‌పాండర్‌పై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు 634 బోట్లలో ట్రాన్స్‌పాండర్లున్నాయి. వీటిని ఎలా వినియోగించాలనే అంశంపై ప్రతి మత్స్యకారుడికీ అవగాహన కల్పిస్తున్నారు.

సమగ్ర సమాచారం అందించేలా...

సముద్రంలో వాతావరణం ఎలా ఉంది.? తుపాను హెచ్చరికలు ఏమైనా ఉన్నాయా.? అనే సమాచారం అందించేలా దీన్ని రూపొందించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు కొన్ని సందర్భాల్లో ఫోన్ సిగ్నల్స్‌ను కోల్పోతారు. అటువంటి సమయంలో వారికి తుపాను సమాచారం, ఇతర ప్రమాదాల సమాచారం చేర్చాలంటే అత్యంత కష్టం. అలాంటి సమయంలో ఈ ట్రాన్స్‌పాండర్లు మత్స్యకారులకు ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తుంది, తద్వారా వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి సహాయపడుతుంది. సరిహద్దులు దాటకుండా మత్స్యకారులను హెచ్చరించి, ఇతర దేశాల భద్రతా సిబ్బందికి చిక్కకుండా కాపాడుతుంది. సముద్రంలో ప్రమాదం జరిగితే శాటిలైట్ ద్వారా కోస్టుగార్డు, మత్స్యశాఖ కార్యాలయం, బోటు యజమానికి సమాచారం వెళ్తుంది. అంతేకాదు చేపల పెంపకానికి సంబంధించిన సమాచారాన్ని ఇది అందిస్తుంది. ఈ పరికరంలో రెండు భాగాలుంటాయి. ఒకటి బోటుకు, మరొకటి డ్రైవర్ వద్ద అమర్చుతారు. ఇది బ్యాటరీ సాయంతో పని చేస్తుంది. అయితే కొందరు మత్స్యకారులు వీటిని అమర్చినప్పటికీ.. స్విచ్ ఆఫ్ చేసేస్తున్నారు. ఫలితంగా ఆ బోట్లకు సందేశాలు పంపించడం ఇబ్బందవుతోంది. వేట కోసం బోటు ప్రారంభించిన వెంటనే ట్రాన్స్‌పాండర్ స్విచ్ ఆన్ చేస్తే సమాచారం అందించగలమని, ఈ విషయంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలంటూ ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

పల్లె పండగ నిధులు మంజూరు చేయాలి

దేవరాపల్లి: గ్రామాలలో అట్టహాసంగా పల్లె పండగ పేరిట రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన కూటమి ఎమ్మెల్యేలు వాటిని పూర్తి చేయడంలో విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. మండలంలోని అసంపూర్తిగా నిలిచిపోయిన చింతలపూడి పంచాయితీ శివారు వీరభద్రపేట, వాలాబు–కోనాం రోడ్డును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ మాడుగుల శంకర పంచాయతీ తాడివలస, గొప్పూ రు, రాజంపేట, వెలంపాడు, కొత్తవలస, రావిపాలెం, మామిడిపాలెం గ్రామాలకు గత ప్రభుత్వం రూ. 9.20 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. నిర్మాణంలో ఉన్న రోడ్లకు ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. దేవరాపల్లి మండలం వాలాబు పంచాయితీ పరిధిలోని రూ.12 కోట్లతో గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మిస్తే కేవలం రూ.40 లక్షలు మాత్రమే నిధులు మంజూరు చేయడం దారుణమన్నారు. చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటకు బీటీ రోడ్డు నిమిత్తం రూ. 84 లక్షలు మంజూరు చేయగా ఎర్త్ వర్క్ మాత్రమే చేసి నిలిపి వేయడంతో ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారన్నారు. బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలకు గత ప్రభుత్వం హయాంలో రోడ్డు సౌకర్యం కల్పించగా, మిగిలిన పనులకు ప్రస్తుత ప్రభుత్వం రూ.1.90 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించక పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి అసంపూర్తి రోడ్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మినీ కంటైనర్ ఢీకొని వృద్ధుడు మృతి

కశింకోట: బయ్యవరం గ్రామ పరిధిలోని భీమాస్ హోటల్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కె.లక్ష్మణరావు అందించిన వివరాల ప్రకారం.. బయ్యవరం వద్ద రోడ్డు దాటుతున్న శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలంలోని బోరిగవలస గ్రామానికి చెందిన రాజాపు గురన్న (64)ను యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న మినీ కంటైనర్ వేగంగా వచ్చి ఢీకొని పరారయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. తమ గ్రామస్తులతో కలిసి మినీ బస్సులో తునిలో తలుపులమ్మ ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి వస్తూ మార్గమధ్యంలో బయ్యవరం వద్ద టీ తాగి గురన్న రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Get your Degree from Govt. Recognized University. Failed Students can complete Degree in Credit Transfer, Eligible for all Jobs, Exams in July. Pass Guarantee, Ph : 79972 96796 [V- 12551]

Real Estate

RESTAURENT FOR SALE

■ Excellent Running Hyderabadi Non Veg. Restaurant (40 seating) for sale. Near Rama talkies, Visakhapatnam. Ph : 95733 37307 [V- 14053]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

Wanted

■ సెక్యూరిటీ గార్డులు కావలెను (స్త్రీ/పురుషులు), జగదాంబ ఏరియాలో పనిచేయుటకు జీతం: 14,000/- మరియు ఇతర సదుపాయాలు కలవు. సంప్ర॥ 96032 16460/63007 25191. [V- 3577]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15195]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA25005931]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

'మున్నా' భాయ్ ఎవరో?

- ఢిల్లీ నుంచి 25 గ్రాముల కొకైన్‌ని విశాఖకు తీసుకొచ్చిన నిందితులు
- బయటకు పొక్కనివ్వకూడదంటూ కూటమి నేతల ఫోన్లు



సాక్షి, విశాఖపట్నం: నగరంలో డ్రగ్స్ రవాణా వెనుక పెద్ద తలలే ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి నేతల వారసులే మత్తు పదార్థాల సూత్రధారులనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దొరికిన వారే దొంగలన్నట్లుగా చిత్రీకరించి.. డ్రగ్స్ రవాణా వెనుక ఎవరి హస్తం ఉందన్న అంశాలను కూటమి నేతలు తొక్కిపెట్టేందుకు తెరవెనుక ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ టీడీపీ ఎంపీ పోలీసులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని తెలుస్తోంది. కీలక సూత్రధారిగా ఉన్న మున్నా కాల్ రికార్డులను పరిశీలిస్తే.. కొంతమంది కూటమి నేతలతో సంబంధాలున్నట్లుగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. నగర చరిత్రలోనే భారీ మొత్తంలో డ్రగ్స్‌ను త్రీ టౌన్ పోలీసులు రెండు రోజుల క్రితం పట్టుకున్నారు. సెంట్రల్ ఏజెన్సీ సమాచారంతో డ్రగ్ పెడ్లర్స్‌పై దాడులు నిర్వహించి 25 గ్రాముల కొకైన్‌తో పాటు రూ.3.5 లక్షల నగదు, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించిన కొద్ది గంటల వ్యవధిలోనే పోలీసులకు కూటమి నేతల నుంచి ఫోన్లు రావడం మొదలయ్యాయి. అప్పటికే డ్రగ్స్ పట్టుకున్నట్లు బయటకు తెలియడంతో పోలీసులు వివరాలు వెల్లడించారు. అయినా కూటమి నేతల నుంచి ఒత్తిళ్లు ఆగకపోవడంతో పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో గంజాయి డ్రగ్స్ హబ్‌గా రాష్ట్రం మారిపోయిందంటూ అరుపులు పెడబొబ్బలు పెట్టిన పవన్ కల్యాణ్.. తాము అధికారంలో ఉన్నప్పుడు కూటమి నేతలే సూత్రధారులైనా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

డ్రగ్స్ వచ్చిన గంటలోనే ఓ నేతకు ఫోన్

దక్షిణాఫ్రికాకు చెందిన థామస్‌తోపాటు విశాఖకు చెందిన అక్షయ్ కుమార్ అలియాస్ మున్నా ఇందులో కీలకంగా వ్యవహరించారు. డ్రగ్స్‌ని ఢిల్లీ నుంచి విశాఖకు తీసుకొచ్చిన గంట వ్యవధిలోనే ఉత్తరాంధ్రకు చెందిన ఓ నాయకుడికి ఫోన్ కాల్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారని తెలుస్తోంది. మున్నా ఫోన్‌లో కాంటాక్ట్ లిస్ట్‌లోనూ, కాల్ లిస్ట్‌లోనూ ఓ ఎంపీ ఫోన్ నంబర్‌తో పాటు టీడీపీ నేతలు, వారి వారసుల ఫోన్ నంబర్లు ఉన్నట్లు సమాచారం. అరెస్ట్ చేసిన ఐదుగుర్ని విచారించిన పోలీసులు.. వారి వద్ద నుంచి మరో ముగ్గురు పేర్లు రాబట్టారు. ఈ ముగ్గురికీ రాజకీయ నేతలకు సత్సంబంధాలు ఉండటం, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం విశేషం. వారిని పోలీస్ స్టేషన్ తీసుకొచ్చిన క్షణాల వ్యవధిలోనే కూటమి నేతల నుంచి పోలీసులకు ఫోన్ల మీద ఫోన్లు వచ్చేశాయని తెలుస్తోంది. దీంతో పోలీసులు తాము తీసుకొచ్చిన ముగ్గుర్నీ కేవలం 10 నిమిషాల్లోనే బయటకు పంపించేశారని సమాచారం. తేనె తుట్టె కదిపితే.. కూటమి నేతలు, వారి వారసుల పేర్ల డ్రగ్స్ రాకెట్‌లో బట్టబయలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో.. విచారణ ముందుకు జరగకుండా అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఒత్తిళ్లకు లొంగకుండా విచారిస్తే.. మున్నా వెనుక ఉన్న భాయ్ ఎవరనేది తెలిసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం మాత్రం డ్రగ్స్ కేసును తొక్కి పెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

ప్రశ్నించే పవన్.. ఏమయ్యారు..?



'గంజాయికి నిలయంగా ఏపీ తయారైంది. ఏ రాష్ట్రంలో గంజాయి దొరికినా.. ఏపీ నుంచి.. ముఖ్యంగా విశాఖ నుంచి వెళ్తోంది. రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్చేసింది'

- ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చీమ చిటుక్కుమంటే చాలు ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇదిగో ఇలా ట్వీట్స్‌తో సోషల్‌మీడియాలో రెచ్చిపోయేవారు.

కట్ చేస్తే.. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి కేసులు పెరుగుతూ వస్తున్నాయి. రాష్ట్రంలో ఎటు చూసినా గంజాయి పట్టుబడుతోంది. విశాఖలో వరుసగా డ్రగ్స్ దొరుకుతున్నాయి. ఇంత జరుగుతున్నా పవన్ కల్యాణ్ మాత్రం మౌనముని అవతారమెత్తేశారు. ఏమీ జరగనట్లు తనకేమీ తెలియనట్లుగా నిద్ర నటిస్తున్నారు.

క్లుప్తంగా

మండలం పాటు లలితా సహస్రనామ పారాయణ

కశింకోట: కశింకోట గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో మండలం పాటు నిర్వహించే లలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలశాన్ని వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠాపన చేసి, పూజలు జరిపారు. మహిళలు లలిత సహస్ర నామార్చన చేశారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. 41 రోజుల పాటు లలిత సహస్ర నామ పారాయణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు తెలిపారు.

ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎంపిక



వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటు అయింది. కమిటీ గౌరవాధ్యక్షునిగా భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, సభ్యులుగా కొణతాల లింగాజీ, ఎస్‌వీఎస్ సత్యనారాయణ, భీమరశెట్టి వేణుగోపాలరావు, భీశెట్టి ఆనందకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, వడిశెట్టి ఓం ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమష్టి కృషితో ఆలయ నిర్వహణ, అభివృద్ధి చేయాలని కమిటీ నిర్ణయించింది. నాయకులు పెంటకోట రాము, వేగి గోపీకృష్ణ, వేగి దొరబాబు, బొడ్డేడ బలరామస్వామి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి

అచ్యుతాపురం రూరల్ : డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త రాజాన సన్యాసినాయుడు మాట్లాడుతూ ముఖర్జీ భారతీయ జనసంఘ్‌ను స్థాపించి భారతీయుల్లో ఐక్యతను పెంచేందుకు కృషి చేశారన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంతిన భక్తసాయి రామ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు కూండ్రపు నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు

అనకాపల్లి సినిమాలు

రాజా	: కృష్ణుడికి కెంతో
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: 3 డి
పర్తిసాయి	కుబేర
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: చంద్రేశ్వర
శ్రీ సత్య	: 3బీహెచ్‌కే
రామచంద్ర	: మార్గన్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-6 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించాలి.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 232 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 197 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

దారులిలా.. ప్రయాణమెలా?

- శారదా నది ఆవలి పొలాలకు వెళ్లే దారి శిథిలమై రైతుల ఇక్కట్లు
- వ్యవసాయ ఉత్పత్తులు తెచ్చుకోవడానికి, ఎరువులు, విత్తనాల తరలింపునకు, పశు పోషణకు వీలు కాని పరిస్థితి
- అధికారులకు విన్నవించినా ఫలితం కానరాలేదని అన్నదాతల ఆవేదన



అధ్వానంగా ఉన్న మళ్ల వారి పాకలకు వెళ్లే రహదారి



తుప్పలతో నిండి ఉన్న రహదారి



బురదమయంగా పొలాలకు వెళ్లే రహదారి

కశింకోట: స్థానిక శారదా నది అవతల పొలాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఏ మాత్రం వర్షం పడినా అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి. దీంతో వ్యవసాయ ఉత్పత్తులు తెచ్చుకోవడానికి, వ్యవసాయ సాగుకు ఎరువులు, విత్తనాలు తరలించడానికి, పాడి పశువుల పోషణకు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. కశింకోటలోని అత్యధిక శాతం మంది పొలాలు శారదానది అవతల ఉన్నాయి. అక్కడి కాశీమదుం నుంచి మళ్ల వారి పాకల వరకు ఉన్న గోర్జి రహదారి అధ్వానంగా ఉంది. పలుచోట్ల గోతులు పడి ఉండటంతో సాధారణ రోజుల్లోనే రాకపోకలు సాగించడానికి రైతులు నానా యాతన పడుతున్నారు. ఇక ఏ మాత్రం వర్షం పడినా దిగబడిపోయి రాకపోకలు సాగించడం కష్టంగా పరిణమిస్తోంది. సుమారు దశాబ్దన్నర క్రితం మట్టి రోడ్డును కొంత మేరకు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో మెటల్ రోడ్డుగా ఉపాధి హామీ పథకం నిధులతో కాశీమదుం గ్రోయిన్ వద్ద నుంచి పెద్ద ఏరు వరకు అభివృద్ధి చేశారు. దీంతో రైతులకు ఎంతగానో సౌకర్యవంతంగా ఉండేది. అయితే కాలక్రమంలో ట్రాక్టర్లు, భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రహదారి దెబ్బతింది. అలాగే పెద్దేరు ప్రాంతం నుంచి మళ్ల వారి పాకల వరకు మట్టి రహదారి అడుగు వేయలేని దుస్థితిలో ఉంది. ఏ మాత్రం వర్షం పడినా నడవడానికే తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే బురదమయంగా మారి జారి పోతుండటంతో రాకపోకలు సాగించడం గగనమే. ద్విచక్ర వాహనాలు సైతం జారిపోయి, దిగబడిపోతున్నాయి. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, తమకు తిప్పలు తప్పడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పొల్లాల్లో ఉండే పాడి పశువుల నుంచి పాలు సేకరించడానికి, పోషణకు గత్యంతరం లేక అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు కల్పించుకుని దెబ్బతిన్న రహదారులను పూడ్చడంతో పాటు అసంపూర్తిగా మిలిగిపోయిన మట్టి రోడ్డును మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

శిథిల రహదారితో సమస్యలు..



కాశీమదుం గ్రోయిన్ వద్ద నుంచి పొలాలకు వెళ్లే రోడ్డు గోతులు పడి అధ్వానంగా ఉంది. దీంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వ్యవసాయ ఉత్పత్తులు తెచ్చుకోవడానికి, ఎరువులు, విత్తనాలు వగైరా తరలించడానికి వీలు కావడంలేదు. దీని దృష్ట్యా గతుకులు పూడ్చి మెటల్ రోడ్డు నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వేగి సోమేశ్వరరావు, రైతు, కశింకోట

వర్షం వస్తే బురదమయం..



కాశీమదుం నుంచి మళ్ల వారి పాకల వద్దకు వెళ్లే గోర్జి రహదారిలో వర్షం పడితే బురదమయంగా మారిపోతోంది. దీంతో జారిపోతుండటంతో వ్యవసాయ కార్యకలాపాలు మానుకోవలసి వస్తోంది. వ్యవసాయ భూముల వద్ద పాకల్లో ఉంటున్న పాడి పశువులు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– వి. సత్యారావు, రైతు, కశింకోట.

ఘనంగా వెంకన్న పవిత్రోత్సవాలు



వెంకన్నకు తొలి ఏకాదశి పూజలు చేస్తున్న అర్చకులు పులఖండం ప్రసాద్, రాజేష్

అనకాపల్లి: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం స్థానిక దేమునిగుమ్మం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో అలివేలు మంగమ్మ సమేత వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలను ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబు ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు ఆలయ మండపంలో సంకల్పం, దీక్షాధారణ, పంచగవ్య, ప్రాశన, మృత్సంగ్రహణం వంటి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, అర్చకులు పులఖండం ప్రసాద్‌బాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేడ 'తోడపెద్దు' కథకు తృతీయ బహుమతి



బొడ్డేడ బలరామస్వామి

కశింకోట: స్థానిక కథా రచయిత బొడ్డేడ బలరామస్వామి రాసిన 'తోడపెద్దు' కథకు 2025 కథల పోటీలో తృతీయ బహుమతి లభించింది. తెలంగాణ రాష్ట్రం ముల్కనూర్ సాహితీ పీఠం పోటీ నిర్వహించింది. సుమారు 600 కథలు పోటీకి వచ్చాయి. వీటిలో తృతీయ స్థానంలో నిలిచిన మేరకు బహుమతికి ఎంపిక చేశారు. ఈ నెల 27న వరంగల్ జిల్లాలోని ముల్కనూరు సాహితీ పీఠంలో జరిగే బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో రూ.10 వేల నగదు, ప్రశంసా పత్రం, షీల్డు బహూకరించి సత్కరించనున్నట్లు విజేత బలరామస్వామి తెలిపారు.

జగ్జీవన్ రామ్ సేవలు ఎనలేనివి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనకాపల్లి టౌన్: జగ్జీవన్‌రామ్ ఉప ప్రధానిగా దేశానికి అనేక సేవలు చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పోచపల్లి వెంకట్రావు అన్నారు. పట్టణం భీమినిగుమ్మంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి ఆదివారం జరిగింది. ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కనిశెట్టి సురేష్ బాబు, కట్టుమూరు మంగరాజు, కాకినాడ కనకేశ్వరరావు, చేవ్వేటి కమల చంటి, తుమ్మి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తుడు

మునగపాక: మండలంలోని పాటిపల్లి-మంగళవరపుపేట గ్రామాల పరిధిలోని గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యులవుతున్నారు. ఆదివారం పాటిపల్లికి చెందిన ఆడారి అప్పారావు కుమారుడు ఎ.వి.ఎస్. మూర్తి,శారద దంపతులు రూ.11,116 నగదును విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు.

13న మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని తగరంపూడిలో ఈ నెల 13న మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. భావితరాల కోసం మొక్కలు నాటి, సంరక్షించడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. మొక్కలు నాటే కార్యక్రమానికి క్లబ్ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇక్కట్లు

కశింకోట: ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా సాయంత్రం 5.30 ప్రాంతంలో పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరా లేక ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో జంపర్ తెగిపోవడం వల్ల సరఫరాకు అంతరాయం కలిగిందని సిబ్బంది తెలిపారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న దాకారపు శ్రీనివాసరావు

కశింకోట: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరిగే కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. ఆటో అండ్ మోటార్ వర్కర్స్ సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం కశింకోటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని, దీనివల్ల రవాణా రంగం తీవ్ర నష్టానికి గురవుతోందన్నారు. వాహనాల మీద ఆధారపడి జీవించే మోటార్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాటం చేసి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.లోవరాజు, కార్యదర్శి జె.సన్యాసినాయుడు, కోశాధికారి జి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న మిత్ర వాకర్స్‌క్లబ్ సభ్యులు

మునగపాక: ఏకాగ్రతతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని మిత్ర వాకర్స్ క్లబ్ ప్రతినిధి సూరిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇటీవల జరిగిన పదవతరగతి పరీక్షల్లో 578 మార్కులు సాధించి, నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన టిక్కలి భాగ్యలక్ష్మిని ఆదివారం ఉదయం మిత్ర వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇష్టపడి,కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మల్ల జోగారావు, కె.వి.ఎస్. అప్పారావు,వెలగా శ్రీనివాసరావు, వి.డి.ఎం. నాయుడు,పొలిమేర కృష్ణ, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు తప్పనిసరి

దేవరాపల్లి : పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి జి.గాయిత్రీదేవి సూచించారు. ప్రపంచ జూనోటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరాపల్లి పశువైద్యశాలలో 15 పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు వేశారు. జంతువుల నుంచి పశువులకు, పశువుల నుంచి జంతువులకు వ్యాపించే వ్యాధులను జ్యూనోటిక్ వ్యాధులు అంటారన్నారు. రేబిస్, బ్రూసెల్ల, టీబీ, స్వైన్‌ఫ్లూ, తదితర జ్యూనోటిక్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగులలో ఆదివారం జూనోసిస్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో అన్ని రైతు సేవాకేంద్రాల్లో 161 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసారు. ఏడీ చిట్టినాయుడు మాట్లాడుతూ పశువుల నుంచి సంక్రమించే వ్యాధుల గురించి వివరించారు. ఈనెల 7 వ తేదీ నుండి14 వ తేదీ వరకు మాడుగుల, చీడికాడ మండలాల్లో రైతు సేవా కేంద్రాలులో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

మాకవరపాలెం : జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్య కేంద్రం వద్ద కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. వివిధ గ్రామాలకు చెందిన 60 మంది తమ పెంపుడు కుక్కలను తీసుకువచ్చి వ్యాక్సిన్‌లు వేయించారని పశువైద్యాధికారి మణిదీప్ తెలిపారు.

చీడికాడ: పెంపుడు జంతువులతో జాగ్రత్తగా మెలగాలిని పశుసంవర్ధక సహాయకులు ఎం.శ్రీనివాసరావు అన్నారు.ప్రపంచ జినోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ ఇస్తే రేబిస్ వంటి సంక్రమిత వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చునన్నారు.అలాగే పెంపుడు జంతువుల విషయం తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నర్సీపట్నం : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు ప్రత్యేక టీకాల శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు, వార్డు కౌన్సిలర్ పద్మావతి ప్రారంభించారు. శిబిరంలో 115 పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. శిబిరంలో వైద్యులు దుర్గాప్రసాద్, నరేష్, పుష్ప, శిరీష, యమున, పశువైద్య సహాయకులు అలివేణి, భవాని, శ్రీరామ్మూర్తి, లాబ్ టెక్నీషియన్ ఉదయ, గోపాలమిత్రలు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుడి తిరుగు రథయాత్ర



తిరుగు రథయాత్రలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి వారు

కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీజగన్నాథ స్వామి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం తిరుగు రథయాత్ర వైభవంగా జరిగింది. స్థానిక ఆలయం నుంచి రథంపై జగన్నాథ స్వామి, బలభద్ర, సుభద్రల విగ్రహాలను నిలిపి గ్రామంలో ఊరేగించారు. తీన్‌మార్ డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అధిక సంఖ్యలో యువతీ, యువకులు ఉత్సాహంగా రథాన్ని ముందుకు లాగగా.. ఆలయం నుంచి ఉత్సాహంగా ఊరేగింపు ప్రారంభమైంది. అక్కడి నుంచి గ్రామ ప్రధాన వీధుల మీదుగా రథోత్సవం సాగింది. దారి పొడవునా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రామచరణాచార్యులు తదితరులు దారి పొడవునా స్వామి వారిని దర్శించుకున్న భక్తులను ఆశీర్వదించారు. ఉదయం ఆలయంలో విష్ణుమూర్తి దశావతారాల్లో చివరిదైన కల్కి అవతారంలో స్వామిని అలంకరించి విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో పలువురు నాయకులు

అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా గాండ్ల తెలికుల కులస్తులు 20 లక్షల మందికి పైగా ఉన్నా, బీసీ కార్పొరేషన్‌లో ప్రాతినిధ్యం లేని దుస్థితి కొనసాగుతోందని గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గండేపల్లి వెంకటరావు అన్నారు. స్థానిక గవరపాలెం విశాఖ ఫైనాన్సియర్స్ సంక్షేమ సంఘం హాల్లో ఈ ఏడాది పదో తరగతి, ఇంటటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన సంఘం విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల్లో శాఖల ఏర్పాటుతో పాటు, భవిష్యత్ కార్యాచరణపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మనాపల్లి వాసు మాట్లాడుతూ కులవృత్తిగా సాగుతున్న నూనె వ్యాపారం ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల చొరబాటుతో కుంగిపోతోందని, దీని వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు పెరుగుతున్నాయని తెలిపారు. గౌరవాధ్యక్షుడు రాజపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ సంఘంలో విద్యార్థులు సమాజంలో గొప్ప స్థానాలు పొందాలని కోరారు. అనంతరం పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సింహాద్రి అలేఖ్య (593 మార్కులు), చిత్రాడ సౌమ్య సత్య, ఎన్నేటి జశ్విత, గండేపల్లి హాసిని, ఇంటర్‌లో పేరూరి రత్నమణి 986 మార్కులు, గండేపల్లి నేహా, బోయిదాపు ప్రణీత్, ఇంజరపు చేతనకు స్కారల్‌షిప్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలకు ఏర్పాట్లు పూర్తి



కరపత్రం విడుదల చేస్తున్న కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్: సత్యనారాయణపురం కల్యాణగిరిపై ఉన్న కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణమాస పూజలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త బోయిన రమణాజీ తెలిపారు. ఆలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాని ఆలయ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు సామూహిక కుంకుమార్చన, సహస్రనామ పూజలు, సమూహిక అష్టోత్తర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు నెల రోజుల పాటు తమ గోత్ర నామాలతో పూజలు చేయించుకునేందుకు రూ.500 ఆలయ ప్రతినిధులకు చెల్లించాలన్నారు. అలాగే శ్రావణమాసం నెల రోజులూ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, చైర్మన్ కోటిపల్లి వెంకటరమణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగ్రాస వారోత్సవాలు



పశుగ్రాస వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ, అధికారులు

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఈ నెల 7 నుంచి 14 వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. ఆదివారం వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పశుగ్రాసాల సాగు.. పాడిరైతుల ఇంటి సిరుల బాగు కార్యక్రమం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.రామ్మోహనరావు, ఏడీ బి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.











